

సాగులో ఉన్న పంట ధ్వంసం
ఓ గిరిజన రైతు 33 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలో ఉన్న కంది పంటను కొందరు వ్యక్తులు ట్రాక్టర్‌తో దున్నివేసి దౌర్జన్యానికి పాల్పడ్డారు. - 8లో..



కెనాల్లో గల్లంతైన యువకుడు మృతి
దొనకొండ మండలం పోలేపల్లి ఎస్సీకాలనీకి చెందిన యువకుడు బుధవారం సాగర్ కెనాల్లో ఈతకు వెళ్లి గల్లంతవగా, గురువారం మృతదేహం లభ్యమైంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
37 /28

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

బకాయిలు కోట్లు.. హామీలకు తూట్లు !

నల్ల బర్లీ పొగాకు చివరి ఆకు వరకూ కొంటాం.. ఇది వ్యవసాయ శాఖామంత్రి అచ్చెంనాయుడు చెప్పిన మాట.. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జిల్లాలో 6,325 టన్నుల నల్ల బర్లీ పొగాకు ఉత్పత్తి కాగా, ఇప్పటి వరకు కొనుగోలు చేసింది కేవలం 860 టన్నులు మాత్రమే. అంటే, ఉత్పత్తిలో కేవలం 15 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. ఇందుకు రైతులకు చెల్లించాల్సిన రూ.7 కోట్ల బకాయిలు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. అసలే మద్దతు ధర రాక అల్లాడుతున్న రైతులు కూటమి ప్రభుత్వ చర్యలతో మరింత ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నారు.



- పొగాకు రైతును నమ్మించి మోసం చేస్తున్న ప్రభుత్వం
- బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేస్తున్నామంటూ ఊరిస్తున్న వైనం
- జిల్లాలో 6,325 టన్నుల ఉత్పత్తి
- ఇప్పటివరకు కేవలం 860 టన్నులే కొనుగోలు
- ఒక్క రూపాయి కూడా రైతుకు చెల్లించని ప్రభుత్వం
- రైతులకు చెల్లించాల్సింది రూ.7 కోట్లు
- దిక్కుతోచని స్థితిలో జిల్లాలోని పొగాకు రైతులు

ఒంగోలు సబర్బన్:

మిర్చి రైతును దగా చేసినట్టుగానే ప్రభుత్వం పొగాకు రైతునూ నయవంచన చేస్తోంది. బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్నామని కూటమి ప్రభుత్వ పెద్దలు.. కొనుగోళ్లు ప్రారంభించి దాదాపు 48 రోజుల కావస్తోంది. అయినా ఇంత వరకు ఒక్క రూపాయి కూడా రైతుకు చెల్లించలేదు. రైతులు పెట్టిన పెట్టుబడి, బయట తెచ్చిన అప్పులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్న ఆలోచన కూడా చేయడం లేదు చంద్రబాబు ప్రభుత్వం.

రైతుల వద్దే 5,465 టన్నులు...

జిల్లాలో బ్లాక్ బర్లీ పొగాకు దాదాపు 6,325 టన్నులు ఉత్పత్తి అయినట్లు అధికారులు అంచనాలు రూపొందించారు. జిల్లాలోని దాదాపు 20 మండలాల్లో బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేశారు. ప్రధానంగా నాగులుప్పలపాడు, రాచర్ల, మద్దిపాడు, ముండ్లమూరు, దొనకొండ, కురిచేడు, పామూరు, కొమరోలు, తాళ్లూరు మండలాల్లో అత్యధికంగా సాగు చేయగా, మరో 11 మండలాల్లో ఒక మోస్తరుగా సాగు చేశారు. మద్దిపాడు మండలం గార్లపాడు గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని రైతులందరూ బ్లాక్ బర్లీ పొగాకును అక్కడకు తీసుకురావాలని సూచించారు. ఇంత పెద్ద మొత్తంలో ఉత్పత్తి అయితే.. తొలుత 500 టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆ తర్వాత 800 టన్నులు అన్నారు. ప్రస్తుతానికి 1000 టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు 400 మంది రైతుల నుంచి 860 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. అయినా ఏ ఒక్క రైతుకూ ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ఇప్పటి వరకు జిల్లాలోని రైతాంగానికి దాదాపు రూ.7 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

ఆశగా ఎదురుచూస్తున్న వర్జీనియా రైతులు...

వ్యాపారుల చేతిలో చిక్కి శల్యమవుతున్న వర్జీనియా పొగాకు రైతులు కూడా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయిస్తుందేమోనన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారులు ఇదేవిధంగా కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెడుతుంటే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయించారు. చివరకు లో గ్రేడుకు మంచి ధర రాగా ఎందుకూ పనికిరాని మాడు రకం పొగాకుకు కూడా అనుకోని విధంగా ధరలు పెరిగి రైతులు ఎంతో లాభపడ్డారు. కానీ, ప్రస్తుతం బ్లాక్ బర్లీ పొగాకులో ఉత్పత్తి అయిన దానిలో కనీసం 15 శాతం మాత్రమే కొనుగోలు చేసి రైతులను ఇబ్బంది పెడుతున్న చంద్రబాబు ప్రభుత్వం ఇక వర్జీనియా పొగాకు రైతులను ఆదుకునే అవకాశాలు కనుచూపు మేరలో కనపడటం లేదని రైతు సంఘ నాయకులు అంటున్నారు.

ఆంక్షలతో చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వం...

రైతుల వద్ద ఉన్న చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆచరణకు వచ్చేసరికి ఒక్కో రైతు నుంచి గరిష్టంగా 20 క్వింటాళ్లకు మించి కొనుగోలు చేయబోమని ప్లేటు ఫిరాయించింది. దానికితోడు 20 శాతానికి మించి తేమ శాతం ఉండరాదని కూడా స్పష్టంగా ఆంక్షలు విధించింది. ఇలాంటి సందర్భాల్లో సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇస్తారు. గరిష్టంగా ఐదు, 10 ఎకరాల పరిధిలోని రైతుల వద్ద పంట నిల్వలు కొనుగోలు చేయాలి. ఐదెకరాల్లోపు చిన్న రైతు దగ్గర సైతం దాదాపు 60 టన్నులకు తక్కువ కాకుండా పొగాకు నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టిన నిబంధనల ప్రకారం 20 క్వింటాళ్లు కొనుగోలు చేస్తే మిగిలిన 40 క్వింటాళ్లను ఆ రైతు ఏం చేసుకోవాలి. కొనుగోలు చేస్తామని నమ్మించి మోసం చేసిన కంపెనీలు కొనుగోలు చేయకపోవడంతోనే ఈ సంక్షోభం ఏర్పడింది.

రైతును ఆదుకోవాల్సిన బాధ్యత టీడీపీ ఎమ్మెల్యేలకు లేదా..



పొగాకు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత టీడీపీ కూటమి పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలకు లేదా.? రైతుల ఓట్లు వేయించుకుని ఎమ్మెల్యేలుగా జిల్లాలో గెలిచారు కదా.. మరెందుకు పొగాకు రైతుల కష్టాలు పట్టించుకోవటం లేదు. ఏదో నామమాత్రంగా బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, జిల్లాకు చెందిన మంత్రి స్వామి పొగాకు రైతుల కష్టాలను సీఎం చంద్రబాబు దృష్టికి ఎందుకు తీసుకెళ్లడంలేదో ప్రజలకు చెప్పాలి. ఇంతటి తీవ్రమైన కరువులో జిల్లా రైతాంగం ఉండటంతో పాటు పొగాకు రైతు కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. పొదిలి వేలం కేంద్రానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చినప్పుడు ధరలో కొద్దిగా కదలిక వచ్చింది. ఆ తర్వాత యథావిధిగానే వ్యాపారులు కూటమి కట్టి మరీ ప్రభుత్వానికి సవాలు విసురుతున్నారు.

– చుండూరు రవిబాబు, వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్

లో గ్రేడ్ కోసం రూ.1000 కోట్లు కేటాయించాలి



జిల్లాలోని రైతుల వద్ద ఉన్న లో గ్రేడ్ పొగాకు కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయిస్తేనే ఈ సంక్షోభం తీరుతుంది. క్వింటా రూ.20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలి. ఈ ఏడాది వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా వర్జీనియా పొగాకు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. కంపెనీలు, బోర్డు సూచనలకు అనుగుణంగా సాగుచేసిన రైతుకు సరైన దిగుబడులు రాక, గిట్టుబాటు ధర లభించక, వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు జరక్క తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

– పమిడి వెంకట్రావు, ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

న్యూస్‌రీల్

9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఒంగోలు వన్‌టౌన్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9వ తేదీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖాధికారి, ఎస్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారి వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు మినీ స్టేడియం పక్కనున్న గిరిజన భవన్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

22న తపాలా జీవిత బీమా ఏజెంట్ల ఎంపిక

ఒంగోలు వన్‌టౌన్: భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలు కట్టించే ఏజెంట్లను ఎంపిక చేసేందుకు ఈ నెల 22వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీసెస్ ప్రకాశం డివిజిన్ ఎండీ జాఫర్ సాధిక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఏజెంట్లకు వారు సేకరించిన పాలసీలపై ఆకర్షణీయమైన కమీషన్ చెల్లించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు కనీసం 10వ తరగతి పాసై 18 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ప్రాంతీయంగా పరిచయాలు కలిగి ఇన్సూరెన్స్ గురించి తెలిసి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటాతో పాటు టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, పాన్ కార్డుతో 22వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రకాశం పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ కార్యాలయం, అంజనేయ కాంప్లెక్స్, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలులో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు రూ.5 వేలకు ఎన్ఎస్‌సీ, కేవీపీ అకౌంట్ రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని తెలిపారు.

క్రీడా స్ఫూర్తి చాటాలి



మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో, డీఈఓ, తదితరులు

ఒంగోలు: ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తి చాటుతూ త్వరలో నిర్వహించనున్న సౌత్ జోన్ పోటీల్లో జిల్లా పతాకాన్ని రెపరెపలాడించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఓ చిన్నఓబులేసు పిలుపునిచ్చారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ పీ ఆనంద్ మినీ స్టేడియంలో గురువారం నిర్వహించిన 10 రకాల ఆటల పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకంతో పాటు జిల్లా పతాకాన్ని, జిల్లా క్రీడాపతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిభ చాటేందుకు ఈ పోటీలు మంచి అవకాశమని అన్నారు. డీఈఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఏ రంగంలో రాణించాలన్నా క్రమశిక్షణ ముఖ్యమన్నారు. ఇది క్రీడాకారుల్లో ఎక్కువగా ఉంటుందని, అందువల్ల చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి జి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, వాలీబాల్ పోటీలు నిర్వహించి అండర్–22 విభాగానికి జిల్లా బాలబాలికల జట్లు ఎంపిక చేస్తున్నామన్నారు. ఎంపికైన జట్లు త్వరలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో తలపడతాయని తెలిపారు. అనంతరం పోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కర రావు, క్రీడల ఇన్‌చార్జి వై.శీనయ్య, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీలకు చెందిన అర్హత ఉన్న విద్యార్థులు తమ పోస్టుమెట్రిక్ అనంతర ఉపకార వేతనాల రెన్యువల్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు గోడు పట్టని ప్రభుత్వం

- పొగాకు రైతులను ఆదుకోవటంలో కూటమి ప్రభుత్వం విఫలం
- ఆత్మహత్యలు చేసుకునే స్థితికి రైతులను తీసుకెళ్తున్న పాలకులు
- ఒంగోలు–2 పొగాకు వేలం కేంద్రంలో వేలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి మేరుగు నాగార్జున



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు మేరుగు నాగార్జున, చుండూరు రవి, తదితరులు

ఒంగోలు సబర్బన్: పొగాకు రైతుల గోడును కనీసం విననైనా వినకుండా, కననైనా కనకుండా కళ్లులేని కబోదిలా టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలకులు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, పార్టీ నాయకులతో కలిసి ఒంగోలు–2 పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. స్థానిక త్రోవగుంటలోని వేలం కేంద్రంలో వేలం జరుగుతున్న తీరును పరిశీలించారు. రైతులు, పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న వేలం గురించి తెలుసుకున్న మేరుగు నాగార్జున.. పొగాకు రైతులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావన్నారు. కూటమి ప్రభుత్వం పొగాకు రైతులను నిలువునా మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. పొగాకు వ్యాపార కంపెనీలతో ప్రభుత్వం చేతులు కలిపి మరీ పొగాకు రైతును నట్టేటముంచే పనిలో ఉందన్నారు. చంద్రబాబు సర్కారు తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పొగాకు రైతు కుదేలవుతుంటే చూడలేక మరో దఫా వేలం తీరును పరిశీలించేందుకు తాము వచ్చామన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతుల బాధలను కళ్లారా చూసేందుకు పొదిలి వచ్చారన్నారు. పొగాకు రైతులు పడుతున్న కష్టనష్టాలపై కేంద్రానికి, రాష్ట్రానికి లేఖలు కూడా రాశారని గుర్తుచేశారు. అసలు రైతులను ఏం చేయాలనుకుంటున్నారు చంద్రబాబూ అంటూ మేరుగు నాగార్జున ప్రశ్నించారు. పొగాకు రైతును పాతాళానికి నెడుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా పొగాకు ధర రూ.28 వేలకు వెళ్తే.. చంద్రబాబు ప్రభుత్వంలో అదికాస్తా రూ.15 వేలకంటే కిందకు దిగజారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ బర్లీ పొగాకును రైతులందరి వద్ద కొనుగోలు చేయకుండా టీడీపీ నాయకులకు చెందిన పొగాకును మాత్రమే చీటీలు తీసుకుని మరీ కొనుగోలు చేయటం దుర్మార్గమైన చర్యని అన్నారు. కుదేలవుతున్న రైతులను చూస్తూ ఉండలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ఎమ్మెల్యేలను తాను వేడుకుంటున్నానని, చంద్రబాబు వద్దకు వెళ్లి పొగాకు రైతులను ఏ విధంగా ఆదుకుంటారో అడగాలని సలహా ఇచ్చారు.

నాణ్యమైన పొగాకుకు కూడా రూ.280 దాటడం లేదు : చుండూరు రవిబాబు

నాణ్యమైన పొగాకును కూడా కేజీ రూ.280 దాటకుండా కొనుగోలు చేస్తున్నారంటే.. వ్యాపారులు, ప్రభుత్వం ఏ విధంగా లాలూచీపడ్డారో అర్థమవుతోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. వ్యాపారులు, ప్రభుత్వ పెద్దలు కుమ్మక్కై పొగాకు రైతును నిలువునా అప్పులపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పొగాకుకు డిమాండ్ క్రియేట్ చేయటంలో పొగాకు బోర్డు తీవ్రంగా వైఫల్యం చెందిందన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు సిగ్గుపడాలన్నారు. కనీసం చంద్రబాబుతో మాట్లాడి రూ.200 కోట్లు తీసుకొచ్చి రిజెక్టు చేసి వెనక్కుపంపుతున్న పొగాకును కొనుగోలు చేయలేని ఎమ్మెల్యేలు ఎందుకున్నారంటూ ఆయన ప్రశ్నించారు. రైతుల్ని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల బంగారుబాబు మాట్లాడుతూ లో గ్రేడ్ పొగాకును వెనక్కుపంపే పనిలోనే వ్యాపారులు, బోర్డు ఉన్నాయన్నారు. ఇంత పండించండి అని ఆథరైజేషన్ ఇచ్చి మరీ కొనుగోలు వద్దకు వచ్చేసరికి ఎందుకు ఈ రకంగా మోసం చేస్తున్నారని నిలదీశారు. రాష్ట్రంలో రూ.1.93 లక్షల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు రూ.500 కోట్లు ఇచ్చి పొగాకు రైతును ఆదుకోలేడా అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు బీఎస్ఆర్ మూర్తి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, నాయకులు కాట్రగడ్డ మహేష్ బాబు, పోలవరం శ్రీమన్నారాయణ, రైతులు పాల్గొన్నారు.

గెలవలేకే రమేష్ యాదవ్‌పై దాడి



అంబేడ్కర్, పూలే విగ్రహాలకు నివాళులర్పిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు, నాయకులు

- ఇలాగైతే రేపు మీ పార్టీ కార్యకర్తలు రోడ్లపై తిరగలేరు
- కూటమి పార్టీలకు వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు హెచ్చరిక

ఒంగోలు టౌన్: పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలలో గెలుపుపై నమ్మకం లేకనే కూటమి పార్టీల పాలకులు, నాయకులు కలిసి వైఎస్సార్ సీపీకి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. పులివెందుల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ సెంటర్లోని బీఆర్ అంబేడ్కర్, జ్యోతీరావుపూలే విగ్రహాలకు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పార్టీ నాయకుడు రామలింగారెడ్డిపై కత్తులు, ఇనుపరాడ్లు, రాళ్లతో దాడి చేయడం అత్యంత హేయమైన చర్యని ఖండించారు. ఈ చర్యలు ప్రజాస్వామ్యాన్ని కాలరాసే విధంగా ఉన్నాయన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించకుండా కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. పోలీసుల వ్యవహారశైలి అభ్యంతరకరంగా ఉందన్నారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నట్లు కనిపిస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి ఎంతమాత్రం మంచిది కాదని అన్నారు. కొండపి పంచాయతీ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న మేరీ అనే మహిళా అభ్యర్థిని కూడా ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు.

వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి చేయడాన్ని క్రూరమైన చర్యగా అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలకు తావులేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు మంచిదికాదన్నారు. ఇలాగైతే 2029లో రానున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కూటమి పార్టీల నేతలు బయట తిరగలేరని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నాయకుడు బొట్ల రామారావు, నగర ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకునేందుకు పోలీసుల ప్రయత్నాలు...

వైఎస్సార్ సీపీ నాయకుల నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేశారు. ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా నిరసన కార్యక్రమం గురించి తెలుసుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. తొలుత వన్‌టౌన్ సీఐ నాగరాజు పార్టీ నాయకులకు ఫోన్ చేశారు. ఇది మీ పరిధి కాదు కదా అని నాయకులు ప్రశ్నించిన వెంటనే టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు తెరమీదకు వచ్చారు. ఒకసారి పోలీసు స్టేషన్‌కు రావాలని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావుకు ఫోన్ చేశారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లిన ఆయనతో సీఐ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా నిరసన ప్రదర్శనలు చేయడానికి వీలు లేదని హుకుం జారీ చేశారు. సమాచారం అందుకున్న చుండూరి రవిబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఇతర నాయకులు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసుల అనుమతి కోరుతూ లేఖ రాసిచ్చారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని చెప్పినప్పటికీ సీఐ వినలేదు. పార్టీ నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అక్కడి నుంచి వచ్చిన నాయకులు అంబేడ్కర్, పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతుండగా ముగ్గురు ఎస్సైలు వచ్చి ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి వీల్లేదని, విగ్రహాలకు పూలదండలు వేయకూడదని అడ్డుకున్నారు. పార్టీ కార్యాలయంలో చేసుకోవాలంటూ ఎస్సై సందీప్ ఉచిత సలహా ఇచ్చారు. దాంతో బొట్ల రామారావుకు ఎస్సైకు మధ్య వాదన జరిగింది. అయినప్పటికీ పార్టీ నాయకులను బలవంతంగా అక్కడి నుంచి పంపించి వేశారు. పోలీసుల ఓవరాక్షన్‌పై పార్టీ కార్యకర్తలు, నాయకులు, స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

చేనేత ఉత్పత్తులను ఆదరించాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ఒంగోలు సబర్బన్: చేనేత ఉత్పత్తులను ఆదరించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులతో కలిసి స్థానిక కలెక్టరేట్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జేసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వదేశీ ఉద్యమంలో చేనేత ఉత్పత్తులు కూడా కీలకపాత్ర పోషించాయన్నారు. కాలపరీక్షను ఎదుర్కొని నిలబడిన చేనేత రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చారిత్రక విశిష్టత కలిగిన చేనేత రంగాన్ని ఆదుకునేలా ప్రభుత్వం విద్యుత్, జీఎస్టీ రాయితీతోపాటు చేనేత కారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. చేనేత సొసైటీలకు ఆప్కో నుంచి రావాల్సిన బకాయిలు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ సందర్భంగా చేనేత ఉత్పత్తులను సొసైటీలు విక్రయించుకునేలా అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. మరో స్వాతంత్ర్య ఉద్యమంలా చేనేత ఉత్పత్తులను ఆదరించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఎల్‌డీఎం రమేష్ మాట్లాడుతూ చేనేతకారులకు ముద్ర రుణాలు త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. చేనేత, జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రఘునందన్ మాట్లాడుతూ ముద్ర పథకం కింద బ్యాంకు రుణాల కోసం 2024 – 25 సంవత్సరంలో 217 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 27 దరఖాస్తుదారులకు రూ.26 లక్షల రుణం మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ఏడుగురు చేనేతకారులను జాయింట్ కలెక్టర్ సన్మానించారు. చేనేత వస్త్రాల ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వి.భీమయ్య, డెవలప్మెంట్ ఆఫీసర్ ఏ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డెవలప్మెంట్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ముందుగా ప్రకాశం భవనం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీని డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు ప్రారంభించారు. చేనేత రంగ విశిష్టతను ఆయన కొనియాడారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

పురుగు మందు తాగి యువకుడు మృతి

దొనకొండ: పురుగు మందు తాగిన యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పెదన్నపాలెం గ్రామానికి చెందిన తాళ్ల వెంకట్రావు(33) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం పక్క ఇంటి వారు గొడవ పడ్డారని మనస్తాపం చెంది గడ్డి మందు తాగాడు. భార్య గురులక్ష్మి హుటాహుటిన తన భర్తను చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందగా స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై త్యాగరాజు తెలిపారు.

సాగులో ఉన్న పంట ధ్వంసం

- 33 ఏళ్లుగా అనుభవంలో ఉన్న గిరిజన రైతు
- మొలకెత్తిన పంటను అక్రమంగా దున్నిన అమ్మకందారుని కుటుంబ సభ్యులు
- పోలీసులను ఆశ్రయించిన గిరిజనులు


బాధితులతో ఘర్షణ పడుతున్న దృశ్యం


ట్రాక్టర్లతో కంది పంటను దున్నుతున్న చిలకా వెంకయ్య కుటుంబ సభ్యులు

మర్రిపూడి: మూడు దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూమిలో ఉన్న కంది పంటను ఆ భూమి తమకు చెందిందంటూ ఓ వ్యక్తి, అతని కుటుంబ సభ్యులు ట్రాక్టర్‌తో దున్నివేసిన సంఘటన మర్రిపూడి మండలం ఎస్టీరాజుపాలెం గ్రామశివారులో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. ఎస్టీరాజుపాలెం గ్రామానికి చెందిన గిరిజన రైతు పొన్నర్సు నాగేశ్వరరావు 33 ఏళ్ల క్రితం పొదిలి మండలం రాజుపాలేనికి చెందిన చిలకా వెంకయ్య, తుళ్లూరి పెద్దన్న వద్ద ఎస్టీరాజుపాలెం గ్రామ శివారులో సర్వే నంబర్ 178-2లో 4.32 ఎకరాలు, సర్వే నంబర్ 56-2లో 4.09 ఎకరాల భూమి కొనుగోలు చేసి అనుభవిస్తున్నారు. అప్పటి నుంచి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు సాగుచేసుకుంటున్నారు. అయితే, ఇటీవల ఆ భూమిని గతంలో అమ్మిన చిలకా వెంకయ్య కుటుంబానికి చెందిన వారసులు తమదంటూ వచ్చి సాగులో ఉన్న వారిపై గొడవకు దిగారు. ఈ నేపథ్యంలో బాధితులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిని ఆశ్రయించి తమ గోడు వెల్లబోసుకున్నారు. నేనున్నానని మంత్రి హామీ ఇవ్వడంతో సదరు భూమిలో కంది పంట సాగుచేశారు. ప్రస్తుతం కంది పంట మొలకెత్తింది. ఆ పంటను చిలకా వెంకయ్య కుటుంబ సభ్యులు, వారి బావ మరుదులు 3 ట్రాక్టర్లతో వచ్చి నిలువునా దున్నేశారు. అడ్డుకోబోయిన బాధితుడు, అతని కుటుంబ సభ్యులతో వాదనకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బాధితులు అడ్డం తిరిగితే అంతమొందించేందుకు సైతం మారణాయుధాలను పొలం వద్దకు ట్రాక్టర్‌లో తీసుకొచ్చినట్లు బాధితురాలు పొన్నర్సు శ్రీదేవి తెలిపారు. దీనిపై బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

త్రిపురాంతకం: మండలంలోని కొత్త ముడివేముల ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు. నిందితుల నుంచి రూ.1.02 లక్షల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

సాగర్ కెనాల్లో గల్లంతైన యువకుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

దొనకొండ: మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బెజవాడ మనోజ్(18) బుధవారం చందవరం సమీపంలోని సాగర్ కాలువలో ఈతకు వెళ్లి నీటి ప్రవాహంలో గల్లంతైన విషయం తెలిసిందే. గురువారం ఎస్సై టి.త్యాగరాజు పర్యవేక్షణలో పోలీస్, అగ్నిమాపక సిబ్బంది మనోజ్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. డ్రోన్ ఆపరేటర్ నాయక్ సహాయంతో మృతదేహాన్ని గుర్తించి, పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి తిరుపాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మీ జవాన్ ఇంట్లో చోరీ

కంభం: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు అపహరించిన సంఘటన స్థానిక వెంకటేశ్వరనగర్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. స్థానిక న్యూ ఆల్ఫా స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న ఆర్మీ జవాన్ మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దర్శనానికి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున ఇంటి బయట గేటు తాళం పగలగొట్టి ఉండటాన్ని పక్కింటి వారు గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి అందులోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. దీంతో స్థానికులు ఇంటి యజమానికి, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై నరసింహారావు పరిశీలించారు. మార్కాపురం క్లూజ్ టీమ్ బృందం వేలిముద్రలు సేకరించింది. ఇంట్లో 2 తులాల బంగారు నగలు, 20 తులాల వెండి పట్టీలు, రూ.50 వేల నగదు అపహరణకు గురైనట్లు సమాచారం. ఇటీవల కాలంలో పట్టణంలో దొంగతనాలు పెరిగిపోతుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

పండగ పూట మృత్యు'కీర్తన'


మృతి చెందిన కీర్తన

త్రిపురాంతకం: కళాశాలకు వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో తండ్రితో కలిసి బైక్‌పై సంతోషంగా ఇంటికి వెళ్తున్న బాలికను మార్గమధ్యంలో మృత్యువు బలితీసుకుంది. ఈ సంఘటన త్రిపురాంతకం మండలంలోని కంకణాలపల్లి రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. కురిచేడు పడమర మాలపల్లెకు చెందిన బుట్టి కీర్తన(17) త్రిపురాంతకంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వరలక్ష్మి వ్రతం, రెండో శనివారం, ఆదివారం.. ఇలా వరుసగా 3 రోజులు కళాశాలకు సెలవు రావడంతో తండ్రితో కలిసి బైక్‌పై ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో కంకణాలపల్లి వద్ద బైక్ అదుపు తప్పడంతో సీసీ రోడ్డుకు కీర్తన తల బలంగా కొట్టుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెకు స్థానిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం పల్నాడు జిల్లా వినుకొండ తరలించగా అక్కడ మృతి చెందింది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

పిడుగుపాటుకు ఒకరు మృతి

- మృతుడు వీరరాంపురం గ్రామ వైస్ సర్పంచ్


మృతి చెందిన దానయ్య

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వీరరాంపురం గ్రామ పంచాయతీ వైస్ సర్పంచ్ గోనా దానయ్య(48) గురువారం సాయంత్రం పిడుగుపాటుకు మృతి చెందారు. వివరాలు.. దానయ్య వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై నందనవనం వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో ఉరుములు మెరుపులతో భారీ వర్షం మొదలవడంతో రోడ్డు పక్కనే ఉన్న నందనవనం ఎంపీటీసీ నారాయణస్వామి పొలంలో రేకుల షెడ్ వైపు అడుగులు వేశారు. అదే సమయంలో పిడుగు పడటంతో దానయ్య అక్కడికక్కడే మృతి చెందారు. రేకుల షెడ్ కింద ఉన్న మరో ఇద్దరు షాక్‌కు గురై కాసేపటికి తేరుకున్నారు. మృతుడు దానయ్య భార్య సునీత అంగన్‌వాడీ కార్యాకర్తగా పనిచేస్తూ అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందింది. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. అందరితో కలివిడిగా ఉండే దానయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆవును ఢీకొట్టిన ఆటో

- వృద్ధురాలు మృతి.. మరో ముగ్గురికి గాయాలు


మృతి చెందిన సిద్ధమ్మ

కంభం: ప్రయాణికులతో వెళ్తున్న ఆటో రోడ్డుపై అడ్డుగా వచ్చిన ఆవును ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి అనంతపురం-అమరావతి హైవే రోడ్డుపై కంభం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. కందులాపురం సెంటర్ నుంచి జంగంగుంట్లకు వెళ్తున్న ఆటో గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద అడ్డుగా వచ్చిన ఆవును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దూదేకుల సిద్ధమ్మ(65) మృతి చెందగా వెంగమ్మ, ఖాసింబి, ఆటో డ్రైవర్ ఓబుల్‌రెడ్డికి మోస్తరు గాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని, క్షతగాత్రులకు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.